పచ్చని సంసారం

కోరుకొండ సత్యానంద

రాజేష్ ఆలోచిస్తున్నాడు.

చక్రవర్తి చెప్పిందాంట్లో ఆదర్శం ఉంది..... ఒక మోడువారిపోయిన జీవితానికి చేయందించి ఆ జీవితాన్ని వసంతం వెల్లివిరిసిన బాటలోకి మళ్ళించాలన్న ఉదాత్తమైన ఉద్దేశం ఉంది.... అతనా విషయాన్ని చెప్పేతీరులో తప్పకుండా అనుకున్నది సాధించాలన్న స్థిరత్వం ఉంది.... అయినా కొంచెం ఆవేశం, మరికొంచెం తొందరపాటు ఉన్నాయనుకున్నాడు రాజేష్.....

కారణం... చక్రవర్తి రాజేష్ మంచి స్నేహితులే అయినా.... చక్రవర్తి అనుకున్నది ఎలాగైనా చేసేయాలి అనుకుంటాడు.... రాజేష్ అన్నింటినీ పట్టించుకొని ఎక్కువగా ఆలోచిస్తాడు....

"మీ నాన్నగారు ఏమేమిరా వీళ్లేదంటున్నారా?" రాజేష్ అడిగాడు.

"అందుకే ఆయన్ని పట్టించుకోదలచుకోలేదు..." విసురుగా సమాధానం ఇచ్చాడు చక్రవర్తి...

"ఒప్పించడానికి ప్రయత్నించావా?"

"ఆయనది ఒప్పుకునే తత్వంకాదు...."

"ఆయనకు నువ్వు పుత్రుడివి, శత్రువ్వి కాదు కదరా!?;"

"అంటే నీ ఉద్దేశం?"

"ఆయన ఆలోచించే ఆలోచనలు కూడా మనం ఆలోచించాలి.... పరిశీలించాలి"

"పరిశీలిస్తే ఆయనకు న్యాయం చేయలేనేమో!?"

"పరిశీలించకుండా మనం ఏ పరిస్థితికీ తావివ్వగూడదు.. అయినా ఆమెకు న్యాయం చేయాలని నీ తండ్రికి అన్యాయం చేయడం సబబా?"

"నేను లేకపోయినా ఆయనకు అన్యాయం జరగదు...."

"నువ్వు లేకపోతే ఆమెకు అన్యాయం జరుగుతుందా?"

"పల్లవిని నేను ప్రేమించాను.... ఆమెకు నా అండ అవశ్యం!"

"ప్రేమించడానికి నీకెవ్వరూ కన్పించలేదా?'

"కన్పించిన ప్రతివారిమీదా ప్రేమ పుడుతుందా!?"

"పల్లవి నిన్ను ప్రేమిస్తుందా?"

"పిచ్చిప్రశ్న!" పేలవంగా అన్నాడు చక్రవర్తి.

"నీకలాగే అన్పిస్తుంది... అవసరం ఆమె అంగీకారంలోని అంతరార్థమేమో!?"

"కాదు... ఇందులో అవసరం అనే పదానికి తావులేదు...."

"అయితే ఆమె నిన్ను గాఢంగా ప్రేమిస్తుందంటావు..."

"ఎందుకిలాంటి పనికిరాని ప్రశ్నలేస్తావురా?"

"నేను వేసే ప్రశ్నలు పనికిరానివి కాదురా.... పరిస్థితిని ఆకళింపు చేసుకోవాలంటే ఇలాంటి ప్రశ్నలెంతో అవసరం. నేను చెప్పేది విను.. ఆవేశాన్ని తగ్గించుకొని మరొకసారి ఆలోచించి నాన్నగారితో విషయాన్ని వివరంగా చర్చించు.... ఆ తర్వాత నీకు ఎలా చేయాలన్పిస్తే అలా చేయి..."

"నాన్నగార్ని ఇంకేమీ అడగదలచుకోలేదు..."

"ఏం, ఎందుకని?"

"ఆయనింకేమీ వినదలచుకోలేదని చెప్పేసారు.... అందుకే మా పెళ్ళికి నువ్వు పెద్దగావుండి ఈ కార్యక్రమం పూర్తయ్యేవరకూ మాకు చేదోడువాదోడుగా ఉండాలి..... నీకు ట్రాన్సఫర్ కూడా వచ్చిందంటున్నావ్.. వీలైనంత తొందరగా ఆమెను నా దానిగా చేసేసుకుందా మనుకుంటున్నాను...."

రాజేష్ చక్రవర్తి వైపు వింతగా చూసేడు..... మళ్ళీ చక్రవర్తే అన్నాడు.

"నేను చేస్తున్నది తప్పుగా కన్పిస్తుందా నీకు కూడా? నేను చేయాలనుకున్నదానిని స్నేహితుడివి కాబట్టి చేప్పేను.... అర్థం చేసుకొని నేను చేసేదాంట్లో తోడుంటావని అడిగాను.... నువ్వు కూడా కాదంటే నేనేం చేయలేను గానీ 'అనుకున్నది మాత్రం ఆగిపోదు రాజేష్...!"

రాజేష్ అదోలా నవ్వేడు... "పిచ్చి చక్రవర్తి! నేనాలోచిస్తున్నది నువ్వడిగిన సహాయం కాదురా.... నీ మనసు గురించి. నీ ధృఢనిశ్చయం గురించి, నన్ను సహాయం చేయమని అడిగే రీతిలోని దబాయింపు గురించి... నా ట్రాన్స్‌ఫర్ మాటకేంలే, ప్రమోషన్‌ను వదులుకుంటే ట్రాన్స్‌ఫర్ అదే ఆగిపోతుంది. నీ పెళ్ళికి పెద్దగా ఉండడానికి నాకెటువంటి అభ్యంతరం లేదురా! అయితే నేను పెద్దను కాబట్టి, పెద్దలుగా ఉన్నవాళ్ళు సమస్యను సామరస్యంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు కాబట్టి ఆ ప్రయత్నంలో ప్రధాన భాగాలుగా నన్ను ఒకసారి మీ నాన్నగారితో, ఆమెతో మాట్లాడటానికి అనుమతినిస్తావా?"

రాజేష్ కళ్ళల్లోకి చక్రవర్తి సూటిగా చూస్తూ....." ఆమె దగ్గరకు వెళ్ళి ఏం మాట్లాడాలన్నా మాట్లాడు. కానీ నాన్నగారితో మాట్లాడడం అనవసరం అనుకుంటాను" అన్నాడు.

"అవసరం అని నేననుకుంటున్నాను!"

"సరే నీ ఇష్టం!" భారంగా విట్టూరుస్తూ అన్నాడు చక్రవర్తి....

** ** **

చక్రవర్తి ఆ సమయంలో ఆఫీసులో ఉంటాడు. అందుకే రాజేష్ ఆ సమయంలో వాళ్ళింటికెళ్ళాడు. రాజేష్ వచ్చాడని చెప్పటానికి రంగయ్య లోపలికి వెళ్ళాడు. రాజేష్ అక్కడున్న సోఫాలో కూర్చొని టీపాయ్ మీద వున్న 'మేగజైన్'ను తిరగేయడం మొదలుపెట్టాడు.

ఓ రెండు నిముషాల తర్వాత.—

"ఏవయ్యా, రాజా! చాన్నాళ్ళకొచ్చావ్... ఎలా ఉంది ఉద్యోగం?" అంటూ ఓ యాభై ఏళ్ళు పైబడ్డ వ్యక్తివచ్చి రాజేష్ ఎదురుగా కూర్చున్నారు.

ఆయన చక్రవర్తి తండ్రి... రంగనాథంగారు...

రాజేష్ గౌరవపూర్వకంగా మూసి "నమస్కారమండి... ఉద్యోగానికేముందిలెండి, బాగానే ఉంది. కానీ ట్రాన్స్‌ఫర్ ఆన్ ప్రమోషన్! ప్రమోషను వచ్చినందుకు సంతోషంగా ఉన్నా, ట్రాన్స్‌ఫరవుతున్నందుకు బాధగా ఉందండి!" అన్నాడు.....

"ఉంటుందయ్యా. కానీ తప్పదుకదా? మన్వీ ఊళ్ళో లేకపోతే నాతో ఇలా అప్పుడప్పుడు వచ్చి పరదాగా అన్ని విషయాలు మాట్లాడేవాళ్ళు ఇంకెవరున్నారయ్యా నాకు?"

"నాకు మాత్రం ఎవరున్నారు చెప్పండి? చిన్నప్పుడే అందర్నీ పోగొట్టుకున్నా చిన్నతనం నుండీ చక్రవర్తితో స్నేహం చేస్తూ తిరగడంవలన మీరందరూ అయినవాళ్ళు మిగిలారు నాకు... ఈ ట్రాన్స్‌ఫర్ నాకెంతో వైరితిని సృష్టిస్తుందండీ.... అందుకే..

"అందుకే ప్రమోషన్ వద్దు, ట్రాన్స్‌ఫర్ వద్దు అని కాగితం పెడదామనుకుంటున్నావా?"

చక్రవర్తి ఈమెను ప్రేమిస్తున్నాడో, కామిస్తున్నాడో గానీ... ఈమె మాత్రం చక్రవర్తిని సంపూర్ణంగా ప్రేమించడంలేదు... వాడి నిర్ణయాన్ని కాదనలేని బలహీనత మాత్రం ఉంది ఈమెలో...

ఉండే క్లోజ్ అండ్ పర్మనెంట్ ఫ్రెండ్ అన్నమాట... అని రాజేష్‌వైపు ఓరగా చూసారు రంగనాథంగారు.

"నేనిప్పుడొచ్చింది ప్రమోషను, ట్రాన్స్‌ఫర్, పెళ్ళి ఈ విషయాల గురించి మాట్లాడడానికేనండి...."

"అలాగా? మరి చెప్పవేమయ్యా!? ప్రమోషను, ట్రాన్స్‌ఫర్ల గురించి చెప్పేశావ్, మరి పెళ్ళిగురించి కూడా చెప్పేయ్... ఆనందిస్తాను" ముందుకు ఆపత్తిగాపడి గిలి అడిగారు రంగనాథంగారు.

"పెళ్ళంటే.... నా పెళ్ళిగురించి కాదండి...."

"మరి? ఎవరి పెళ్ళిగురించి?"

రాజేష్ ఒక నిముషం తటపటాయించాడు...

"చెప్పవయ్యా! ఎవరి పెళ్ళిగురించి?"

రాజేష్ రెండు మోకాళ్ళ మీదా రెండు మోచేతుల్ని ఆన్చి రెండు చేతుల్ని దగ్గరకు ముడుచుకొని క్రింద ఉన్న ఎర్రని కార్పెటు వైపు చూస్తూ.... "అదేనండి... మన పక్రకవర్తి పెళ్ళిగురించి...." అన్నాడు.

రంగనాథంగారు చటుక్కిలబడి పోయినట్లుగా సోఫాలో జారగిలబడిపోయారు.

"నువ్వేదైనా సంబంధాన్ని చూసావా వాడికోసం?"

రాజేష్ తలెత్తి రంగనాథంగారివైపు చూడలేదు...

"నువ్వేనా ఆ సంబంధాన్ని వాడికి చూసేవు?"

దెబ్బతిన్నట్లుగా తలెత్తిచూసాడు రాజేష్

"ఏవండీ.... పెద్దవారు... మీరలా మాట్లాడటం బావుండలేదు. విన్నతనంనుండి మీ కుటుంబంతో కలిసి మెలసి ఉంటూ మీ మధ్య కలతలకు కారణాన్ని నేనెలా కాగలనండీ? పక్రకవర్తిగూడా ఈ విషయాన్ని నిన్ననే చెప్పాడు నాకు...."

"అందుకు నువ్వేమన్నావ్?"

"చెప్పిందివిన్నాను.... అడగాల్సినవి అడిగాను. మీతో అవునన్నట్లుగా తలూపాడు రాజేష్...

"అలాంటి పిచ్చిపనులేవీ చేయబోకు.... కాయలందవని చెట్లెదగ కూడదనుకుంటారా ఎవ్వరైనా? కొందరికి కొన్నాళ్ళు దూరమైపోతామని ఈ వయసులో నీకొచ్చిన అవకాశాన్ని జారవిడుచుకుంటే మరలా అది కావాలన్నా మన దగ్గరకు రాకపోవచ్చు. అంతేకాదు, జీవితంలో లోతు తెలియాలన్నా, పరిస్థితులను తట్టుకొనే స్థితికి మనసు ఎదగాలన్నా, ఆరోగ్యకరమైన ఆలోచనలు రావాలన్నా మనిషి నాలుగు ప్రాంతాలు తిరగాలి, మనుష్యుల్ని చూడాలి, మనసుల్ని చదవాలి.... మవ్వు మరలా పెద్ద ఆఫీసరువై ఇదే ఊరికి ట్రాన్స్‌ఫరై రావొచ్చు, ఈ ముసలాడికి బోలెడంత ఆనందాన్ని తెవచ్చు.... ఏమంటావ్?"

రాజేష్ నవ్వేడు చిన్నగా....

"మరి రాజా! ఒక మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసేసుకోగూడదూ? భార్య అంటే జీవితాంతం తోడు

మరోసారి మాట్లాడదామని...''

''అంటే నన్ను ఒప్పిద్దామనేగా నీ ఉద్దేశం?''

''మీ అభిప్రాయం వాడు చెప్పగా విన్నాను.... మీరు ఏ ఉద్దేశంతో కాదంటున్నారో తెలుసుకోవాలని వచ్చా ను.''

''వాడు పంపేడా?''

''వాడసలు వెళ్ళొద్దన్నాడు.... ఈ విషయం ఇంక ప్రస్తావించొద్దన్నాడు.... వాడి నిర్ణయం మార్చుకోలేనన్నాడు... కానీ, నేనే మీదగ్గరకు వస్తానని చెప్పివచ్చాను...''

''నువ్వా అమ్మాయిని చూసావా?''

''లేదండి.... వెళ్తాను''

''వెళ్ళు... నీ మిత్రుడు, నా వంశాన్ని నిలబెట్టేవాడు, గౌరవాన్ని కాపాడేవాడు తీసుకున్న నిర్ణయం ఎలాంటిదో నీకర్థం అవుతుంది... ఆవేశంగా అన్నారు రంగనాథంగారు.

''ఆమెను చూడకపోయినా పరిస్థితి తెలుసండి....''

''నీకేమన్పించింది పరిస్థితి తెలిసిన మరుక్షణంలో?''

''నాకేమన్పించినా... మీరేమనుకుంటున్నారో, ఈ విషయమై మీరేం చేయదలచుకుంటున్నారో చెప్పండి.''

''అవున్లే! నా కొడుకు వయస్సు వాడివే కదూ నువ్వు కూడా! ఆదర్శం అంటారు. కాలాన్ని మారుస్తున్నామంటారు. కానీ ఇవతలివాళ్ళ వైపునుండి ఆలోచించరు. కని, కష్టపడి పెద్దచేసి, ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచి, చదివించి, తీర్చిదిద్ది.... విత్తనాన్ని మహావృక్షంగా చేసి ఆ నీడలో తలదాచుకొని గౌరవాన్ని నిలుపుకొని, పదిమందిలో గర్వంగా తిరగాలన్న మా ఆశని తీర్చడం మీ కనీస కర్తవ్యం అని ఆలోచించని మీ ఆదర్శాలు దారిలో కన్పించిన పిచ్చిమొక్కలకు పూలు పూయించాలని తాపత్రయపడి మమ్మల్ని ఎండిపోయిన మోడులుగా తయారుచేయడానికి పూనుకుంటు న్నారు....'' రంగనాథంగారి కళ్ళలోంచి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి.

రాజేష్ చలించిపోయాడు... ఏమీ మాట్లాడలేకపోయాడు.

''రాజా! పెద్దవాడ్ని, ఏదో ముసలివాడిని. నువ్వు నాకు పెద్దకొడుకులాంటివాడివి. చిన్నన్న మాటల్ని పట్టించుకొని బాధపడకు... చక్రవర్తితో వాదించి అలసిపోయాను. విపరీతంగా ఆలోచించి విసిగిపోయాను. అయినా ఎదురయ్యే భవిష్యత్తు కళ్ళకు కన్పిస్తుంటే బెదిరిపోతున్నాను. నీకు తెలుసుకదా వాడ్ని ఎంత అల్లారుముద్దుగా పెంచేనో? వాడ్ని వదలి ఉండలేను. వాడా పనిచేసినా ఊరుకోలేను. ఎందుకో తెలుసా? వాడి వెనుక వేను, నా పరువు ప్రతిష్ఠలు, ఇద్దరు పెళ్ళికాని చెల్లెళ్ళ భవిష్యత్తులు ఉన్నాయి. అవి ఈ విషయమై వాడు తీసుకొనే నిర్ణయంమీద ఆధారపడివున్నాయి. వాడనే ఆ ఆదర్శంలో వాడివెనుక ఉన్నవారి జీవితాల్ని నాశనం చేస్తాడో, కని, పెంచినవారి మాటకు గౌరవం ఇచ్చి, తోడబుట్టినవారి జీవితాలు చీకటై పోకుండా చేస్తాడో మళ్ళీ ఒక్కసారి ఆలోచించమని చెప్పు రాజా!''

''చెప్తానండి.... కానీ వాడు తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోలేనని నిష్కర్షగా చెప్పేసాడండి. అయినా మళ్ళీ చెప్తాను'' అన్నాడు రాజేష్.

''చెప్పడంకాదు రాజా, ఒప్పించాలి, ఆదర్శభావాలు నాకూ ఉన్నాయి. నా కొడుకు ఆదర్శవంతుడని పదిమందీ వేనోళ్ళ పొగుడుతూంటే ఆనందపడే మనస్సు, ఆశకూడా ఉన్నాయి. కానీ, వాడిపని చేస్తే నాకు తెలిసినంత మేరకు ఎవ్వరూ వాడ్ని ఆదర్శవంతుడని అనరు. అంతేకాదు. రకరకాలుగా అనుకుంటారు... నా ఆడపిల్లల జీవితాలపై వాడు చేసిన పని విపరీతమైన ఒత్తిడిని సృష్టిస్తుంది... అది నేను భరించలేను రాజా!''

రంగనాథంగారు అలసిపోయినట్లుగా ఆగిపోయి ఒక క్షణం తర్వాత మరలా మాట్లాడడం మొదలుపెట్టారు... ''రాజా! ఆదర్శాన్ని ఆచరించాలంటే, మోడువారిపోయిన జీవితాల్ని చిగురింప జేయాలని అనుకుంటే వాడ్ని వాడి ఆదర్శంతో బ్రతకలేని ఇంక బ్రతుకులేని ఈ అమ్మాయికైనా బ్రతుకునివ్వమను....

'అంటే' అన్నట్లుగా తలెత్తి రంగనాథం గారివైపు చూసాడు రాజేష్...

''వీడు లేకపోయినా కొద్దో గొప్పో చదువుకొని ఏదో ఉద్యోగం చేసుకుంటున్న ఆ అమ్మాయి బ్రతకలేకపోదు. వాడికీ విషయం చెప్పు. అడిగిన కట్నాలు ఇవ్వలేని కారణంగా ఇంక పెళ్ళిళ్ళు కావని నిర్ణయం చేసుకొని మోడుల్లా బ్రతుకుతున్న ఏ అమ్మాయి మెడలో తాళి కట్టినా నడవలేక, చూడలేక, మాట్లాడలేక, వినలేక కుమిలిపోతున్న ఏ వికలాంగురాలైన అమ్మాయి మెడలో తాళికట్టినా నేనేమీ అనను, అనుకోను అని చెప్పు. ఆ అమ్మాయిని నా ఒక్కగానొక్క కోడలుగా ఎంతో ఆదరంతో చూసుకుంటానని చెప్పు. అలా చేస్తే పదిమందీ వాడు చేసిందాన్ని 'శెభాష్' అని మెచ్చుకుంటారని కూడా చెప్పు....''

'' వాడు ఆమెను పెళ్ళి చేసుకొనేది పదిమందీ మెచ్చుకుంటారని కాదేమోనండి .....''

''రాజా! వాడిలాగే నీవూ నాతో వాదిస్తున్నావా? అయితే వాడిది ఆదర్శం కాదు... పిచ్చి ఆకర్షణ. ఆదర్శం అయితే నేను చెప్పినవి చేయమను. లేకపోతే ఆకర్షణలో పడి కొట్టుకుపోయి ఒకరి జీవితం కోసం ముగ్గురి జీవితాల్ని నాశనం చేయమను.... వెళ్ళు రాజా, వాడితో చెప్పు....'' అన్నారు భారంగా, బాధగా...

రాజేష్ నెమ్మదిగా లేచి ''వస్తానండి'' అని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న రాజేష్‌వైపు సోఫాలో కూర్చొని మాస్తూ ఏవో ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు రంగనాథంగారు.

** ** **

రాజేష్ నడుస్తున్నాడు:... నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

రంగనాథంగారి మాటలే అతని చెవుల్లో గింగుర్లు పెడుతున్నాయి. రాజేష్ మనసుకూడా అతని మాటల్నే సమర్థిస్తుంది. ఇప్పుడు రాజేష్ ఆలోచనలు ఆ సమర్థన చుట్టూనే తిరుగుతున్నాయి... తనేం చేస్తే ఆయన ఆవేదన తీరుతుంది?

''ఆ తండ్రి గురించే ఆలోచించడం మొదలుపెట్టావు, మరి చక్రవర్తి మాటేమిటి?'' లోపల్నుంచి ఎవరో ప్రశ్న వేసినట్టయింది.

''అది కూడా ఆలోచిస్తున్నాను. చక్రవర్తి చేస్తున్నది ఆమె వైపునుండి ఆలోచిస్తే బాగానే ఉంది. కానీ ఆకుటుంబం వైపునుండి ఆలోచిస్తే మాత్రం నాకు చాలా బాధగా ఉంది ఎందుకో? చక్రవర్తికి మళ్ళీ ఒకసారి చెప్పాలి. చెప్పినా వాడు వింటాడో వినడో?''

''చక్రవర్తి వినడు.... అతని గురించి నీకు చిన్నప్పటినుండీ తెలిసిందే కదా? ఏది ఏమైపోయినా పట్టిన పట్టువదలని మొండివాడు....''

'నువ్వు అన్నది నిజమే! ఒకసారి ఆ అమ్మాయిని కూడా కలుసుకొని మాట్లాడి ఆ తర్వాత చక్రవర్తితో ఈ

ఏడుపు—నవ్వు

'ఏడుపు వచ్చేదాకా.... నువ్వెప్పుడయినా నవ్వావా?' అడిగాడు రవిని ప్రసాద్.

''ఆ.. మొన్న మా నాన్న అరటి తొక్క మీద కాలువేసి పడితే నవ్వాను. వెంటనే ఆయన లేచి నా వీపు మీద వాలుగిచ్చారు! అప్పుడు ఏడ్చాను!'' అన్నాడు రవి.

—జోకర్ (హైదరాబాద్)



ఎప్పుడు?

సతీష్ నోట్స్‌లో తప్పులు దిద్దుతూ "మవ్వు తప్పులు లేకుండా రాయటం నేనెప్పుడు చూస్తానో కదా!" అన్నారు మాష్టారు విసుగ్గా.

"మీరు కళ్ళజోడు పెట్టుకుని దిద్దినప్పుడండీ..." అంటూ పక్కనే వున్న కళ్ళజోడు అందించాడు సతీష్.

—జోకర్ (హైదాబాద్)

విషయం గురించి మాట్లాడతాను. చక్రవర్తిలో ఉన్న పట్టుదల, ప్రేమ ఆమెలో ఉన్నాయో లేవో తెలుసుకోవాలి కదా ముందు?"

** ** **

రాజేష్ ఆ ఇంటి తలుపుల్ని తట్టాడు... ఒక నిముషం తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా ఆమె....

"మీరు.." ప్రశ్నార్థకంగా చూస్తూ అందామె.

"నాపేరు రాజేష్.... చక్రవర్తి ఫ్రెండుని" తనని తాను పరిచయం చేసుకున్నాడు రాజేష్.

"అలాగా? రండి లోపలకు...." అని ఆమె లోపలికి దారితీసి సోఫా చూపించింది.

రాజేష్ కూర్చున్నాడు.

"మీరు కూడా అలా కూర్చోండి...." అన్నాడు.

ఆమె ఎదురుగా ఉన్న ఫేము కుర్చీలో కూర్చుంది.

"పల్లవి అంటే...."

"వేనే! ఇక్కడ నేను తప్ప ఇంకెవ్వరూ ఉండరు..."

"మిమ్మల్ని చూడలేదుగానీ అన్ని విషయాలూ నాకు తెలుసు"

"అవును చక్రవర్తి మీ గురించి అప్పుడప్పుడూ చెప్తుంటారు..."

ఒక నిముషం వాళ్ళిద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు.... ఆ నిముషం సేపూ పల్లవి తలవంచుకొని అరచేతులవైపు చూసుకుంటూ కూర్చుంది... రాజేష్ ఆమె వైపు, ఆ ఇంటివైపు చూస్తూ కూర్చున్నాడు.

తెల్లని ఛాయ, చురుకైన చూపు. నిత్యం నవ్వులు కురిపించేట్లుగా ఉండే ముఖ కవళికలు... అందమైన, ఆకర్షణీయమైన అవయవసౌష్టవం.

గాజులు, మెడలో జాకెట్ లోపలకు బంగారు చెయిన్,. తలలో ఒక గులాబీ, గులాబీ రంగు చీర, అదే రంగు జాకెట్టు లన్నీ ఉన్నాయి ఒక్క నుదుట కుంకుమ తప్ప!

"అది కూడా ఉంటే ఈమె ఇంకెంత ఆకర్షణీయంగా ఉండేదో!? ఇప్పుడైనా ఎవరైనా చెప్తే తప్ప ఎవ్వరూ పోల్చలేరు ఈమె వితంతువని. ఇరవై అయిదేళ్ళు ఉండొచ్చు. ఈమెలో అందం, ఆకర్షణ పోటీ పడుతున్నట్లుగా ఉన్నాయి. అందుకేనేమో చక్రవర్తి ఈమె అంటే అంత ఇదైపోతున్నాడు...." మనసులోనే అనుకున్నాడు రాజేష్.

"మీరేం చేస్తున్నారు?"

పల్లవి వేసిన ప్రశ్నకు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి ఆమె అడిగిందానికి సమాధానం చెప్పాడు రాజేష్.

"ఆ.. చక్రవర్తి చెప్పారు.. మంచి ఫర్మ్, మంచి ఉద్యోగమూను...."

"ఏం మంచిదిలెండి, ట్రాన్స్‌ఫర్స్ విపరీతం! ఇప్పుడు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. మీరెక్కడ చేస్తున్నారు?"

చెప్పింది పల్లవి..

"ప్రైవేటు ఫర్మే అయినా వెల్ ఎస్టాబ్లిష్‌డ్ కదండీ... మీ బ్రాంచి ఆఫీసు వైజాగ్‌లోకూడా ఉంది కదూ?!"

"అవును.. మద్రాసులో కూడా ఉంది.."

"మీతో మాట్లాడాలని వచ్చాను.. స్వరం కొంచెం మార్చి అదోలా అన్నాడు రాజేష్...

"మాట్లాడుతూనే ఉన్నారుగా?" చిన్న నవ్వుని మేళవించి అంది పల్లవి.

"అదే చక్రవర్తి గురించి, మీ గురించి కొద్దిగా మాట్లాడాలి.. అందుకే వచ్చాను.."

"మాట్లాడండి" కాజువల్‌గా అంది పల్లవి.

"ఈ మాటల్లో.. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు సూటిగా వేస్తాను. మీరు కూడా సూటిగా ఏమీ దాచుకోకుండా చెప్పాలి. అయామే క్లోజ్ ఫ్రెండ్ టు చక్రవర్తి..... సో...."

"నేనేం బిడియపడనులెండి.. సూటిగా వేసే మీ ప్రశ్నలకు సరిగ్గానే సమాధానం చెప్తాను. అబద్ధం చెప్పడం అలవాటు చేసుకోలేదు...."

"చక్రవర్తి చాలా మంచివాడు.."

"అవును.. నాక్కు తెలుసు.."

"కానీ మొండివాడు.. ఆ మొండితనంలో లొందరపాటు నిర్ణయాలు తీసుకుంటాడు.. అన్ని వైపు ఒమండి ఆలోచించి ఏ పనైనా చేయాలిరా అంటే అన్నివైపులనుండి ఆలోచిస్తే మనిషి ఏదో ఆలోచనకు లొంగిపోయి అనుకున్న ఏ పనీ చేయలేడు— అని వాదిస్తాడు.. ఒకసారిలాగే ఓ సంవత్సరం క్రితం.....

రాజేష్ చెప్తుండగా పల్లవి మధ్యలో కొంచెం గట్టిగానే నవ్వడంతో రాజేష్ ఆపేసి "ఎందుకలా నవ్వుతున్నారు?" అని అడిగాడు.

"మీ ఫ్రెండ్సిద్దరూ ఒకలాంటివాళ్ళే! ఆయన లొందరపడి నిర్ణయాలు తీసుకుంటారు... మీరు లొందర లొందరగా మాట్లాడేస్తారు.. కాదంటారా?"

రాజేష్ అవునన్నట్లుగా తలూపుతూ నవ్వాడు.

"ఏవో ప్రశ్నలు వేస్తారని అని ఏవేవో చెప్తున్నారు..?"

"మీకూ మాలాగే లొందరపాటు ఉందండోయ్! అడుగుతాను కొంచెం చెప్పనివ్వండి.."

"ఊ.. అయితే చెప్పండి.."

"మీ విషయం వాడు నాకు మొన్ననే చెప్పాడు.."

"నాకు చెప్పే నాలుగురోజులే అయింది లెండి.."

పల్లవి వైపు ఆశ్చర్యంగాచూస్తూ.. "మీతోమా తన నిర్ణయాన్ని నాలుగు రోజుల క్రితమే చెప్పాడా?" అని అడిగాడు..

అవునన్నట్లుగా తలూపింది పల్లవి..

"నిర్ణయం తీసుకోవడం, వాళ్ళ నాన్నగారితో దెబ్బలాడేయడం, మీకు చెప్పేయడం, నాకు చెప్పేయడం అన్నీ ఈ రెండ్రోజుల్లోనే జరిగిపోయాయా?"

"నాకు మాటల్లో చెప్పడం జరిగి నాలుగురోజులే అయినా భావాల్తో ఆర్నెల్ల క్రితమే చెప్పారు"

"మీరేమన్నారు?"

"ఏమీ అనలేదు.."

"ఎందుకని?"

"భావాల్ని చదివి అర్థం చేసుకోవడం అలవాటయ్యింది కానీ, భావాల్ని కోల్పోయి నాలుగేళ్ళయింది.."

!"అంటే.."

"ఆయన పోయి నాలుగేళ్ళయింది..."

"మరి..మాటల్లో తన నిర్ణయాన్ని చెప్పినపుడు మీరేమన్నారు?"

"అబద్ధం ఆడకుండా చెప్తున్నాను.. కాదని, వద్దని, ఇష్టంలేదని అనలేదు గానీ, బాగా ఆలోచించుకోమని చెప్పాను.."

"వాడేమన్నాడు?"

"ఏమంటారో ఆ మాత్రం ఊహించలేరా? ఆలోచించడానికి ఇంకేవీ లేదు, ఆచరించడానికే బోలెడంత ఉంది అని నన్ను దగ్గరకు లాక్కోబోయారు. ఆయనకు అన్ని విషయాల్లోనూ ఆవేశం ఎక్కువే?"

"ఆ ఆవేశానికి కారణం ఆకర్షణ ఏమో!?"



"కావొచ్చు.. కానీ నేనెప్పుడూ అతని ఆవేశానికి తలవంచలేదు.."

"సారీ, నా ఉద్దేశం అదికాదు. వాడు మిమ్మల్ని ప్రేమిస్తున్నానని అన్నాడు. వాడి మాటల్ని బట్టి చూస్తే మీరు లేకపోతే వాడికింక బ్రతుకేలేనట్టు ఫీలౌతాడేమో అని నేననుకుంటున్నాను..."

శుష్కంగా నవ్వింది పల్లవి..

"మిమ్మల్నో విషయం అడుగుతాను..మరోలా అనుకోకండి.."

"ఏమీ అనుకోను.. ఏ విషయమైనా అడగండి ఫర్వాలేదు.."

"ఇప్పుడు నేనడిగేదానికి సరిగ్గా సమాధానం చెప్పాలి.."

"తప్పకుండా.. ఇప్పటివరకూ నేను చెప్పిందేదీ అబద్ధంకాదు.."

"థాంక్యూ! చక్రవర్తి మిమ్మల్నంతగా ప్రేమిస్తున్నాడు కదా, మీరూ చక్రవర్తిని ప్రేమిస్తున్నారా?" పల్లవి కళ్ళల్లోకి చూస్తూ సూటిగా అడిగాడు రాజేష్..

పల్లవి ఒక్క క్షణం అదోలా ముఖం పెట్టి మరుక్షణంలో బరువుగా నవ్వింది.

"చక్రవర్తికి వివాహం కాలేదు.. నేను వివాహితను, వితంతువును.. అంటే భావాలు, స్పందనలు, ప్రతిస్పందనలు, భవిష్యత్తుమీది ఆలోచనలు అన్నింటినీ కోల్పోయినదానను. చక్రవర్తి నన్ను ప్రేమిస్తున్నారు. నేను అతని ప్రేమనుకాదనలేక పోతున్నాను.. అంతే!"

రాజేష్ ఒక నిముషం ఏమీ మాట్లాడలేదు..

"సారీ! వచ్చి చాలాసేపైనా కాఫీయైనా ఇవ్వలేదు..ఒక్క నిముషం వస్తానుండండి" అని పల్లవి వంటగదిలోకి వెళ్ళింది.

రాజేష్ ఆలోచనలో పడ్డాడు.. అతని ఆలోచనలు రంగనాథంగారి మాటలచుట్టూ తిరుగుతున్నాయి. రాజేష్ మనసు కూడా అతని ఉద్దేశం వైపే మొగ్గుతుంది.

చక్రవర్తి ఈమెను ప్రేమిస్తున్నాడో కామిస్తున్నాడో గానీ, ఈమె మాత్రం చక్రవర్తిని సంపూర్ణంగా ప్రేమించడంలేదు. వాడి నిర్ణయాన్ని కాదనలేని బలహీనత మాత్రం ఉంది ఈమెలో. అది వాడి ప్రవర్తన, మాటల ఫలితం కావచ్చు. అలాంటపుడు ప్రేమపాశం, పిల్లల భవిష్యత్తుల ఆరాటాల పోరాటంలో కొట్టుమిట్టాడే ఆ తండ్రికి న్యాయం జరిగితేనే బాగుంటుంది.

అందుకు నేనేం చేయాలి?

ఏమైనా చేయాలి!

చేస్తాను!!

"ఏం చేస్తావ్!" లోపల్నుంచి ఓ ప్రశ్న.

ఒక నిముషం తీవ్రంగా ఆలోచించాడు రాజేష్ గుండెతో ఏవో గుసగుసలాడాడు.

ఆ గుసగుసలు విన్న గుండె తడారిపోయింది "నీ నిర్ణయం న్యాయమో, అన్యాయమో, ద్రోహమో తర్వాత విషయం కానీ నువ్వా పని చేయగలవా..

"చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.. చేసేస్తాను కూడా!"

"అయితే జాగ్రత్తగా వ్యవహరించు. కానీ నువ్వు తీసుకున్న నిర్ణయం ప్రకారం అన్నీ జరిగితే మరి చక్రవర్తి మాటేమిటి? బ్రతుకుతాడా?"

"ఏం ఫర్వాలేదు. కాలం ఎలాంటి గాయాన్నైనా మాన్పుతుంది.. ఎంత క్రుంగిపోయిన మనిషినైనా లేవ దీస్తుంది.."

"నీకు ఆ ధైర్యం, నీ నిర్ణయం ఆ తండ్రికి పేదనిస్తుందన్న నమ్మకం నీకుంటే నువ్వనుకున్నట్టు చేయడానికి జాగ్రత్తగా చేయడానికి జాగ్రత్తగా వ్యవహరించు.."

"అలాగే.."

అంతలో పల్లవి కాఫీ పట్టుకుని రావడంతో రాజేష్‌లోని ఆ అంతరంగ మథనం ఆగిపోయింది.

'మీతో కొన్ని మాటలు మాట్లాడి.. ఒక విషయం చెప్పాలి.." వెమ్మదిగా అన్నాడు రాజేష్ పల్లవితో.

అతని గొంతులో వచ్చిన వింతమార్పును పల్లవి గమనించకపోలేదు.

"ఇంతవరకూ చాలా మాట్లాడారు, చాలా విషయాలు చెప్పారు గానీ, ముందు ఈ కాఫీ త్రాగండి.. ఈ తర్వాత చెబుదురుగాని.." అని కాఫీ కప్పును అతనికందించింది పల్లవి.

రాజేష్ కాఫీ త్రాగేసాడు.

** ** **

రైలు కదిలింది..

పల్లవి కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమెలో రాజేష్ తన ఇంటికివచ్చి మాట్లాడి తన నిర్ణయం చెప్పిన మరుక్షణం నుండి మెదలడం మొదలైన ఆలోచనలు ఇంకా అలా సాగిపోతూనే ఉన్నాయి...



బ్యాట్స్‌మన్

"కొత్త హీరో కపిల్‌దేవ్‌పై మీ అభిప్రాయం చెప్తారా" ప్రశ్నించాడు విలేకరి ఓ నటిని.

కపిల్‌దేవ్ అంటే క్రికెట్ ప్లేయర్ అనుకొని "మంచి బ్యాట్స్‌మన్" చెప్పిందా నటి.

"అతనితో మీరు నటించలేదు కదా... మరి మీకు అతను మంచి బ్యాట్స్‌మన్ అని ఎలా తెలుసు?" అంటూ ఆశ్చర్యపోయాడు విలేకరి.

—పి. వినయకుమార్
(విజయనగరం)

చక్రవర్తి తర్వాత ప్రతిరోజూ వచ్చాడు.. మామూలుగానే ప్రవర్తించాడు.. అతననుకున్న ఆదర్శాన్ని ఆచరించడానికి చేస్తున్న సన్నాహాలు వివరంగా ఆనందంగా చెప్పేడు..

అతను చెప్పినవన్నీ విన్నది పల్లవి.. మనసులో బాధగా నవ్వుకొనేది..పైకి మామూలుగానే నటించేది.. అయినా చక్రవర్తి రెండు మూడుసార్లు అడిగాడు "పల్లవీ, ఎందుకలా వున్నావు?" అని .

సమాధానంగా తను నవ్వింది తప్ప తను చేయబోయేదీ, వారం రోజుల్లో జరగబోయేదీ మాత్రం అతనికి చెప్పలేదు.

"రాజేష్ వచ్చాడా?" అని అడిగాడు రాజేష్ వచ్చి వెళ్ళిన మర్నాడు చక్రవర్తి.

"ఆ.."

"ఏమన్నాడు?"

"మామూలుగా మాట్లాడారు.. చాలా మంచిమనిషి"

"అవును.. మన పెళ్ళి గురించి వాడికన్నీ చెప్పాను. వాడే ఈ విషయంలో మనకు చేదోడువాదోడుగా ఉంటాడు.. పదిరోజుల్లో మనం ఏకమై పోతాం!" అని బుగ్గమీద చిటికనేసి చిలిపిగా నవ్వాడు.

శుష్కంగా నవ్విందిగానీ చక్రవర్తితో ఏ విషయం చెప్పలేదు పల్లవి.

అతనికి ఈ విషయం ఈ రోజు సాయంత్రం తను ఉంటున్న ఇంటికి వెళ్ళినపుడు తెలుస్తుంది.. ఆవేశంతో ఉద్వేగంతో ఆఫీసుకు వెళ్ళి విషయాన్ని తెలుసుకుంటాడు.

గుండెలు బాదుకుంటాడో? కళ్ళు తిరిగి పడిపోతాడో!? ఆ తర్వాత అపహ్యాంచుకొని ..... అతనేమైనా అయిపోతాడేమో!? అపలే మొండివాడు!

ఏమీ అయిపోడు.. కాలం ఎలాంటి గాయాన్నైనా మాన్పుతుంది..ఎంత క్రుంగిపోయిన మనిషినైనా లేవ తీస్తుంది. . అవి అన్న రాజేష్ మాటలు గుర్తుకొచ్చాయి..

రాజేష్ మాట్లాడి మాట్లాడి ఎలాంటి అభిప్రాయాన్ని



వెలిబుచ్చాడు? అతనా నిర్ణయానికొచ్చినట్టు ఎలా చెప్పగలిగేడు? అంతటి ధైర్యం, అలాంటి ఆలోచన ఎలా వచ్చాయి అతనికి?

ఆ రోజు రాజేష్ అన్న మాటలు గుర్తొచ్చాయి పల్లవికి..

** ** **

రాజేష్ కాఫీ త్రాగేసి ఖాళీకప్పు ప్రక్కనున్న టీపాయ్‌మీద పెట్టాడు...

"ఊ... కొన్ని మాటలు మాట్లాడి ఏదో విషయం చెప్తానన్నారు... చెప్పండి" చుబుకం క్రింద అరచేయిని పెట్టి చిన్నగా నవ్వుతూ తమాషాగా అంది పల్లవి...

రాజేష్ చెప్పడం మొదలుపెట్టాడు...

"చక్రవర్తికి తల్లి లేదు... చిన్నప్పటినుండీ అతని తండ్రి అతనిని అల్లారుముద్దుగా పెంచారు... చక్రవర్తికి ఇద్దరు చెల్లెళ్ళు కూడా ఉన్నారు..."

"ఇవన్నీ నాకు తెలుసు... ఎందుకు చెప్తున్నట్టు?" మధ్యలోనే అడిగింది పల్లవి...

"మీకు తెలుసని నాకు తెలుసు... కానీ వాడివెనక ఉన్న పరిస్థితిని మీరు అర్థం చేసుకుంటారని ఇవన్నీ ఉపోద్ఘాతంగా చెప్తున్నాను..."

"ఉపోద్ఘాతాలు, ఉపన్యాసాలు అంటే నాకు అంతగా ఇష్టం ఉండవు... సూటిగా అడగడం, సూటిగా సమాధానం చెప్పడం నాకు అలవాటు..."

"మరి... అలాగైతే చక్రవర్తిని ప్రేమించారా? అన్న నా ప్రశ్నకు మీరు సూటిగా సమాధానం చెప్పలేదెందుకని? అతని ప్రేమను కాదనలేక పోతున్నాను అన్న మీ మాట సూటిగా ఉందా?"

"లేదు... ఒక్కో మనిషి ఎందుకో ఒక్కో మనిషిని బాధ పెట్టలేదు... నేను సూటిగా చెప్పేద్దామని చాలాసార్లు అనుకున్నాను... కానీ చెప్పలేక పోయాను... అతనిని బాధ పెట్టడం నాకు ఇష్టంలేని పనైపోయింది... ఆ విషయంలో నేను నా బలహీనతను జయించలేక పోతున్నాను..."

"కారణం... వాడి అండ మీకు కావాలి అవునా?"

"మీ ఇష్టం.... అలాగే అనుకోండి..."

"నిన్న నాళ్ళ నాన్నగారి దగ్గరకు వెళ్ళాను నేను... మీ విషయం మాట్లాడేను అతనితో..."

"ఆయన ఏమన్నారు?"

అంతా వివరంగా చెప్పాడు రాజేష్... విని నిశ్శబ్దంగా ఉండిపోయింది పల్లవి...

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు రాజేష్...

"ఏమీ లేదు... నా ఈ స్థితి అవిటితనం కంటే దురదృష్టమైనదా అని ఆలోచిస్తున్నాను. చక్రవర్తి తండ్రిగారు చెప్పింది నిజమే! అవిటి వారిమీద జాలి ఉంటుంది అందరికీ... కానీ వాళ్ళంటే వారిమీద చాలామందికి ఉండేది ఈసడింపు, అలుసు, అనుమానం... ఆడది భర్తను కోల్పోతే ఆమె కోరికల్ని, ఆశల్ని చంపుకోవాలి... ఎవరిమీదా ఆశ పెంచుకోగూడదు... దేనిమీదా మోజు పడగూడదు... ఎవరైనా ఆమెను పెళ్ళి చేసుకున్నా రోడ్డుప్రక్కన అమ్మే పాతబట్టలు కొనుక్కుని వేసుకున్న వాడిలా చూస్తుందీ సమాజం అతనివైపు ... అవిటివారిని చేసుకుంటే ఆయన అన్నట్టు దాన్ని ఆదర్శం అని అంటారు అందరూ?"

"మీరు సరిగానే ఆలోచిస్తున్నారు... అయితే మీరు మరో విషయం కూడా ఆలోచించాలి..."

"ఏమిటది?"

"ఒక తండ్రి ఆవేదన, ఇద్దరి ఆడపిల్లల జీవితాలు... వీటిని గురించి కూడా మీరు ఆలోచించాలి... ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి... ఆ నిర్ణయం ఆ ముగ్గురి జీవితాలకూ వెలుగునివ్వాలి..."

"అప్పుడు చక్రవర్తి పరిస్థితి?"

"ఏం ఫర్వాలేదు... కాలం ఎలాంటి గాయాన్నయినా మాన్పుతుంది... ఎంత క్రుంగిపోయిన మనిషినైనా లేవ దీస్తుంది!"

భారంగా నిట్టూర్చింది పల్లవి.

"పల్లవిగారూ! నా ఉద్దేశం మీ ఇద్దరినీ విడదీయడం కాదు... మీ జీవితానికి ఆలంబనగా చక్రవర్తినే కోరుకుంటున్నారా?"

శుష్కంగా నవ్వి... "చెప్పాను కదండీ! మోడువారిపోయిన జీవితానికి ఏ ఆలంబనా అక్కరలేదు... కానీ చక్రవర్తి పరిచయం, అతని మాటలు నాకు చిగురంత ఆశను కలిగించాయి." అంది...

"చక్రవర్తిని వదులుకున్నా మీ ఆశ నిరాశ కాదండీ..."

"ఎలా?" అన్నట్లుగా చూసింది రాజేష్‌వైపు...

"చెప్పాను కదా! మీతో ఓ విషయం చెప్తానని.... అది..." ఆగిపోయాడు రాజేష్.

"చెప్పండి... ఏమిటది?"

* * *

రైలు వరుగులు తీస్తుంది...

ఆ తర్వాత రాజేష్ అన్న మాటలు విన్నప్పుడు ఆమెలో ఎక్కడలేని ఆవేశం వచ్చింది. అదే ఇంకెవరైనా అనుంటే అతడి చెంప పగిలిపోయేది... కానీ పల్లవి ఆ క్షణంలో తన ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకోడానికి చాలా శ్రమ పడింది.

"మిష్టర్ రాజేష్! మీరు చక్రవర్తికి ఫ్రెండ్ అయిపోయారు... కాకపోయినట్లయితే నేనిప్పుడు ఎలా ప్రవర్తించేదాన్నో మీరు ఊహించలేరు... నిర్ణయాలు తీసుకోవడం, కొందరి జీవితాల్ని కాపాడడం మీకే చాతనవు అనుకోకండి... నాకు అందంగా మాట్లాడ్డం, చిదరించుకుని చెంపపెట్టు పెట్టడం కూడా వచ్చు... సో... ప్లీజ్... గెటౌట్!

రాజేష్ వెళ్ళిపోయాక పల్లవి చిన్నపిల్లలా వెక్కివెక్కి ఏడ్చింది...: ఏడుస్తూ విపరీతంగా ఆలోచించింది. ఆఖర్న ఓ నిర్ణయానికి వచ్చి తనతోపాటూ పనిచేస్తున్న అరుణకు అన్నీ చెప్పి చక్రవర్తితో తను చెప్పిన అందమైన అబద్ధాన్ని చెప్పమంది... చక్రవర్తికి ఆఫీసులో అరుణ తప్ప ఇంకెవ్వరూ తెలీదు... తన గురించి ఏమడిగినా ఆమెవే అడుగుతాడు... అరుణ ఆ అబద్ధాన్ని చక్రవర్తి నమ్మేలా చెప్పగలదన్న నమ్మకం పల్లవికి ఉంది... ఎలాంటి పరిస్థితుల్లోనూ చక్రవర్తి తనను కలిసే అవకాశాన్నివ్వదు ఆ అబద్ధం...

ఆ తర్వాత ఆమె చక్రవర్తి గురించిగానీ, తన గురించిగానీ ఏమీ ఆలోచించలేదు... ఆలోచిస్తే ఏదో ఆలోచన తనను ఆపేస్తుంది.

రాజేష్ అన్న మాటలు ఆమె చెవుల్లో ఇంకా గింగుర్లు పెడుతూనే ఉన్నాయి...

...చక్రవర్తికి అందరూ ఉన్నారట... అతను తనని పెళ్ళి చేసుకుంటే ఇద్దరి ఆడపిల్లల జీవితాలు నాశనమై పోతాయట... ఒక తండ్రి గుండె ఆగిపోతుందట... మా ఇద్దరి వివాహం ఒక కుటుంబ నాశనానికి వాంది అవుతుందట...

...అవును... అంతవరకూ అతని ఆలోచనలు సబబే అనుకోవచ్చు...

...నన్ను కూడా ఆలోచించమని చెప్పాడు...

...అలాగే అన్నాను...

కానీ, ఆ తర్వాత...

...చిగురించబోయే మీ జీవితం చక్రవర్తిని దూరం చేసుకోవడంవల్ల మరలా మోడువారిపోదు... నేను తీసుకున్న నిర్ణయాన్ని మీరూ అవునంటే...

'...ఏమిటది?'

'...మీలాగే నాకూ ఎవ్వరూ లేరు... నా వెనుక సమస్యలు కూడా లేవు... మీరూ వైజాగ్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకోండి... ఇద్దరం కలిసి జీవితాన్ని ఆనందంగా, హాయిగా గడుపుదాం..."

ఒక స్నేహితుడు... తన స్నేహితుడి కుటుంబం కోసం తీసుకున్న అద్భుతమైన నిర్ణయం...

అదోలా నవ్వుకుంది పల్లవి...

చీకటిని దూసుకుంటూ సాగిపోతూంది రైలు 'మద్రాసు' వైపుకి...